విపక్ష నేతల ఫోన్లు హ్యాక్!

- దేశంలో మళ్లీ హ్యాకింగ్ కలకలం
- ప్రతిపక్ష నేతలపై మోదీ సర్కార్ నిఘా
- పలువురు నేతల మొబైల్స్‌కు యాపిల్ నుంచి 'హ్యాకింగ్ అలర్ట్' సందేశాలు
- స్వేచ్ఛ, గోప్యత లేకుండా పోయింది
- మోదీ సర్కార్‌పై ప్రతిపక్షాల ధ్వజం
- దర్యాప్తు చేస్తామన్న కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, అక్టోబర్ 31: పెగాసస్ స్పైవేర్ వివాదం మరువకముందే దేశంలో మరోసారి ఫోన్ల హ్యాకింగ్ వ్యవహారం కలకలం రేపింది. గతంలో పెగాసస్ స్పైవేర్ ద్వారా ప్రతిపక్ష నాయకులు, న్యాయమూర్తులు, జర్నలిస్టులు, హక్కుల కార్యకర్తలపై మోదీ సర్కారు నిఘా పెట్టిందన్న ఆరోపణలు వెల్లువెత్తగా.. తాజాగా పలువురు విపక్ష నేతల ఐఫోన్లను హ్యాక్ చేసేందుకు యత్నించిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలువురు ప్రతిపక్ష పార్టీల ఎంపీలు, నేతల ఐఫోన్లకు యాపిల్ నుంచి ఒకేసారి 'హ్యాకింగ్ అలర్ట్' సందేశాలు రావడం సంచలనంగా మారింది. 'ప్రభుత్వ మద్దతున్న హ్యాకర్ల నుంచి మీ ఐఫోన్‌కు హ్యాకింగ్ ముప్పు ఉన్నది. మీ యాపిల్ ఐడీ ద్వారానే మీ ఫోన్‌ను టార్గెట్ చేసే అవకాశం ఉన్నదని యాపిల్ భావిస్తున్నది. మీ ఫోన్లు హ్యాక్ అయితే సున్నితమైన డాటా, కమ్యూనికేషన్లను తస్కరించే ప్రమాదం ఉన్నది. కెమెరా, మైక్రోఫోన్లను యాక్సెస్ తీసుకొంటుంది. ఇది హెచ్చరిక నకిలీ కూడా కావొచ్చు. అయినప్పనటికీ దీన్ని సీరియస్‌గా తీసుకోండి' అని ఆ సందేశం సారాంశం. దీనిపై రాజకీయ దుమారం రేగింది. పలువురు ఎంపీలు, నేతలు తమ ఫోన్లకు వచ్చిన ఈ నోటిఫికేషన్ స్క్రీన్‌షాట్లను మంగళవారం సోషల్ మీడియాలో షేర్ చేశారు. విపక్ష పార్టీల ఎంపీల ఫోన్లను హ్యాక్ చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్నదని దుమ్మెత్తిపోశారు. ప్రజాస్వామ్య దేశంలో స్వేచ్ఛ, గోప్యత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. యాపిల్ హ్యాకింగ్ అలర్ట్ సందేశాలపై దర్యాప్తు జరిపించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

ఎమర్జెన్సీ కంటే దారుణ పరిస్థితులు..

తమ ఫోన్లను హ్యాక్ చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా ఆరోపించారు. తనతో పాటు పలువురు ఎంపీలు, నేతలకు ఈ సందేశం వచ్చిందని పేర్కొన్నారు. దేశంలోని ప్రస్తుత పరిస్థితులు ఎమర్జెన్సీ కంటే దారుణంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు మహువా మొయిత్రా సందేశం పంపారు. హ్యాకింగ్‌పై ఆందోళన వ్యక్తం చేసిన ఆమె, చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. తాను ఈ విషయాన్ని ప్రివిలేజ్ కమిటీ ముందుకు కూడా తీసుకెళ్తానన్నారు. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ, గోప్యతకు భంగం వాటిల్లడం విచారకరమని ఎన్సీపీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. *2024* లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటమి భయం పట్టుకొన్నదని, అందుకే విపక్ష పార్టీల నేతలను లక్ష్యంగా చేసుకొని కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్నదని పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ విమర్శించారు. మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ ట్యాపింగ్‌లకు తాము భయపడేది లేదన్నారు. అదానీ అంశాన్ని లేవనెత్తినప్పుడల్లా ఇంటెలిజెన్స్ ఏజెన్సీలను కేంద్రం రంగంలోకి దించుతున్నదని మండిపడ్డారు. హ్యాకింగ్ అలర్ట్‌పై సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ, శివసేన(యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేదీ ప్రధాని మోదీకి లేఖలు రాశారు. తన ఫోన్‌ను హ్యాకింగ్ చేయడం ద్వారా తనకు సంబంధం లేని సమాచారాన్ని తన ఫోన్‌లో చొప్పించేందుకు అవకాశం ఉన్నదని, తనపై నిందలు వేసేందుకు దాన్ని ఉపయోగించుంకొంటారని ప్రధానికి రాసిన లేఖలో ఏచూరి ఆందోళన వ్యక్తం చేశారు.

నకిలీ కూడా కావొచ్చు.. కానీ: యాపిల్

హ్యాకింగ్ అలర్ట్ వివాదంపై ఐఫోన్ తయారీ సంస్థ యాపిల్ స్పందించింది. కొన్ని యాపిల్ నోటిఫికేషన్లు నకిలీ కూడా కావొచ్చని పేర్కొన్నది. కొన్ని దాడులను గుర్తించలేం కూడా అని తెలిపింది. అయితే విపక్ష ఎంపీలకు హ్యాకింగ్ సందేశాలు ఎందుకు వచ్చాయన్నది మాత్రం చెప్పేందుకు యాపిల్ నిరాకరించింది. 'ఈ అలర్ట్ నోటిఫికేషన్ జారీచేయడానికి గల కారణాలను మాత్రం మేం వెల్లడించలేం. ఎందుకంటే, దాన్ని బయటపెడితే హ్యాకర్లు భవిష్యత్తులో మా నిఘా నుంచి తప్పించుకొనే అవకాశముంది' అని స్పష్టం చేసింది.

దేశం పురోగతి చూడలేకనే..

విపక్షాల ఆరోపణలను కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తోసిపుచ్చారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం గొప్పగా పురోగమించడాన్ని చూడలేకనే విపక్షాలు ఇలాంటి విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ అలర్ట్ నోటిఫికేషన్లు భారత్‌లో మాత్రమే గాక, *150* దేశాల్లోని యూజర్లకు వచ్చినట్టు యాపిల్ వర్గాలు స్పష్టం చేశాయని అన్నారు. అయితే దీనిపై ప్రభుత్వం దర్యాప్తు చేపడుతుందని, ఈ సందేశాలు వచ్చిన వారు దర్యాప్తునకు సహకరించాలని కోరారు.

అలర్ట్ సందేశం వెళ్లిన వారిలో కొంతమంది..

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ఆ పార్టీ ఎంపీ శశిథరూర్, పవన్ ఖేరా, కేసీ వేణుగోపాల్, టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఎన్సీపీ అధినేత అఖిలేశ్ యాదవ్, శివసేన(యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేదీ, ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఓఎస్‌డీ, ది వైర్ వ్యవస్థాపక ఎడిటర్ సిద్ధార్థ వరదరాజన్ తదితరుల ఫోన్లకు ఈ హ్యాకింగ్ అలర్ట్ సందేశం వచ్చింది.

భారతీయులకు వీసా ఫ్రీ ఎంట్రీ

థాయ్‌లాండ్ కీలక ప్రకటన

న్యూఢిల్లీ, అక్టోబర్ 31: భారతీయులు ఇక నుంచి వీసా లేకుండా థాయ్‌లాండ్‌ను సందర్శించవచ్చు. అయితే ఈ ఆఫర్ ఈ ఏడాది నవంబర్ 10 నుంచి వచ్చే ఏడాది మే 10 వరకు మాత్రమే. ఈ తేదీలలో ఒక్కో సందర్శకుడు ఈ ఉచిత వీసాపై 30 రోజుల వరకు తమ దేశంలో ఉండవచ్చునని ఆ దేశ పర్యాటక శాఖ ప్రతినిధి మంగళవారం ఢిల్లీలో వెల్లడించారు. టూరిజం పరిశ్రమను మరింత అభివృద్ధి చేసేందుకు భారతీయులకు ఈ సౌకర్యం కల్పించినట్టు ప్రకటించింది. థాయ్‌లాండ్ టూరిజానికి అధిక ఆదాయం సమకూర్చే దేశాలలో భారత్ ఒకటి.

హిరోషిమా కంటే పవర్‌ఫుల్ అణుబాంబు

తయారు చేస్తున్న అమెరికా

వాషింగ్టన్, అక్టోబర్ 31: హిరోషిమాపై 1945లో ప్రయోగించిన దాని కంటే 24 రెట్లు శక్తివంతమైన అణుబాంబు తయారు చేస్తామని అమెరికా ప్రకటించింది. 2030 నాటికి తమ అణ్వాయుధాల సంఖ్యను వెయ్యికి పైగా పెంచుతామని చైనా ప్రకటించిన అనంతరం పెంటగాన్ ఈ ప్రకటన చేసింది. జాతీయ అణ్వస్త్ర భద్రతా యంత్రాంగం 'బీ61-13' అనే సూపర్ పవర్‌ఫుల్ అణుబాంబును తయారు చేస్తుందని తెలిపింది. మారుతున్న ప్రపంచంలో దేశ భద్రత డిమాండ్ దృష్ట్యా ఈ బాంబు తయారు చేస్తున్నట్టు చెప్పింది. ఈ బాంబ్ తయారీకి 692 మిలియన్ డాలర్లు ఖర్చు చేయనున్నారు.

మణిపూర్‌లో పోలీస్ అధికారి కాల్చివేత

ఇంఫాల్: మణిపూర్‌లోని మోరేలో హెలిప్యాడ్ నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న పోలీస్ అధికారిని అనుమానిత తిరుగుబాటుదారులు కాల్చిచంపారని రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం తెలిపింది. బాధితుడైన సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ చింగ్‌థామ్ ఆనంద్‌ను స్థానిక దవాఖానకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మరణించినట్టు పేర్కొన్నది. నివాస భవనాల నుంచి కాల్పులు జరగడంతో వెంటనే ప్రతిదాడులు చేయలేకపోయామని పోలీసులు తెలిపారు. ఘటన జరిగిన హెలిప్యాడ్‌ను రాష్ట్ర పోలీసుల రవాణా కోసం రాష్ట్ర పోలీసులు, బీఎస్ఎఫ్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. దాడి అనంతరం హెలీప్యాడ్‌వద్ద భద్రతకు పంపిన కమాండోలపై మిలిటెంట్లు ఆకస్మిక దాడి చేశారు.

ముకేశ్ అంబానీకి మరో బెదిరింపు మెయిల్

400 కోట్లు ఇవ్వాలని డిమాండ్

ముంబై: పారిశ్రామిక దిగ్గజం ముకేశ్ అంబానీకి మరో బెదిరింపు మెయిల్ వచ్చిందని పోలీసులు మంగళవారం తెలిపారు. రూ.400 కోట్లు డిమాండ్ చేస్తూ గుర్తు తెలియని వ్యక్తి దీనిని అంబానీ కంపెనీకి సోమవారం పంపినట్లు ఓ అధికారి చెప్పారు. అంబానీ కంపెనీకి నాలుగు రోజుల్లో వచ్చిన మూడో బెదిరింపు మెయిల్ ఇది. రూ.20 కోట్లు డిమాండ్ చేస్తూ శుక్రవారం తొలి మెయిల్ వచ్చింది. రూ.200 కోట్లు డిమాండ్ చేస్తూ శనివారం మరొక మెయిల్ వచ్చింది. వీటిని పంపినవారిని గుర్తించేందుకు ముంబై పోలీసులు, క్రైమ్ బ్రాంచ్, సైబర్ టీమ్స్ ప్రయత్నిస్తున్నాయి.

12 వేల మంది ప్రవాసులపై కువైట్ బహిష్కరణ వేటు

కువైట్: కువైట్ కేవలం 3 నెలల్లో సుమారు 12 వేల మంది ప్రవాసీయులను వారి దేశాలకు పంపించేసింది. ఈ ఏడాది ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు 12 వేల మందిని బహిష్కరించింది. వివిధ నేరాలతో పాటు ప్రజా నైతిక నిబంధనల ఉల్లంఘన, కార్మిక చట్టాల అతిక్రమణ ఆరోపణలతో అక్టోబర్‌లో 4,300 మందిని వెళ్లగొట్టారు. చట్ట ఉల్లంఘనలకు పాల్పడకుండా అడ్డుకోవడానికే ఈ చర్యలు తీసుకుంటున్నట్టు చెబుతున్నప్పటికీ ప్రవాసీయుల సంఖ్యను తగ్గించుకోవడానికే కువైట్ ఈ చర్యలకు పాల్పడుతున్నదన్న విమర్శలున్నాయి.

బారాముల్లాలో ఉగ్రదాడి.. హెడ్ కానిస్టేబుల్ మృతి

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో మరో ఉగ్రదాడి జరిగింది. బారాముల్లా జిల్లాలో మంగళవారం పోలీసు హెడ్‌కానిస్టేబుల్ గులాం మహమ్మద్ దార్‌పై ఆయన ఇంటి వద్ద ముష్కరులు కాల్పులు జరిపారు. దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మరణించారు. కశ్మీర్‌లో గత మూడు రోజుల్లో ఇది మూడో ఉగ్రదాడి. ఆదివారం శ్రీనగర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో పోలీస్ అధికారి తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం పుల్వామాలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన వలస కూలీని ముష్కరులు పొట్టనపెట్టుకున్నారు.

రాజకీయ ప్రత్యర్థిలా గవర్నర్

బిల్లుల ఆమోదంలో తీవ్ర జాప్యం

సుప్రీంకోర్టును ఆశ్రయించిన తమిళనాడు, పంజాబ్ ప్రభుత్వాలు

న్యూఢిల్లీ : ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో గవర్నర్ల వైఖరి వివాదస్పదమవుతున్నది. ఇటీవలే గవర్నర్ తమిళిసై వైఖరిపై తెలంగాణ ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. తాజాగా తమిళనాడు, పంజాబ్ ప్రభుత్వాలు కూడా అదే బాటలో నడిచాయి. తమిళనాడు గవర్నర్ రవి రాజకీయ ప్రత్యర్థిలా వ్యవహరిస్తున్నారని, బిల్లుల ఆమోదంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని తమిళనాడు ప్రభుత్వం ఆరోపించింది. ప్రభుత్వ బిల్లులతో పాటు, నియామక ఉత్తర్వులు, అవినీతికి పాల్పడ్డ మంత్రులు, ఎమ్మెల్యేలపై చర్యలకు చేసిన సిఫార్సులు, రోజువారీ ఫైళ్లు, అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు.. ఇలా వేటిపై కూడా గవర్నర్ సంతకం చేయకుండా రాజకీయ ప్రత్యర్థిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించింది. గవర్నర్ చర్య రాజ్యాంగ విరుద్ధమని, దీనిపై సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని, ప్రభుత్వం పంపిన ఫైళ్లను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించేలా ఆదేశాలివ్వాలని కోరింది. మరోవైపు పంజాబ్ గవర్నర్ బన్వరిలాల్ పురోహిత్‌పై కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. పిటిషన్‌లోని అంశాలు ఇంకా పూర్తిగా తెలియరాలేదు.

2న కేజ్రీవాల్ అరెస్ట్?

ఆప్ నేత ఆతిశీ సంచలన వ్యాఖ్యలు

అరెస్టులకు భయపడబోమని వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 31: మద్యం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను నవంబర్ 2వ తేదీన అరెస్ట్ చేయవచ్చునన్న ఆందోళనను ఆ పార్టీ వ్యక్తం చేసింది. ఈ కేసులో తమ ముందు నవంబర్ 2న హాజరు కావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఇప్పటికే కేజ్రీవాల్‌కు సమన్లు జారీ చేసింది. ఆ రోజు ఈడీ ఆయనను అరెస్ట్ చేయవచ్చునని ఢిల్లీ మంత్రి ఆతిశీ మంగళవారం మీడియా సమావేశంలో ఆరోపించారు. కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు జారీ చేయడం ఇదే మొదటిసారి. కాగా, ఇదే కేసులో సీబీఐ ఆయనను ఏప్రిల్‌లో ప్రశ్నించింది. ఎన్నికల్లో కేజ్రీవాల్‌ను నేరుగా గెలవలేమని తెలుసుకున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇలాంటి కుయుక్తులకు పాల్పడుతున్నదని ఆమె ఆరోపించారు. కేజ్రీవాల్‌ను కూడా అరెస్ట్ చేసి ఆప్ పార్టీని తుడిచిపెట్టడానికి ప్రయత్నిస్తున్నదని ఆమె ఆరోపించారు. కేజ్రీవాల్ తర్వాత జార్ఖండ్ సీఎంహేమంత్ సోరెన్, తేజస్వి యాదవ్, కేరళ సీఎం పినరయి విజయన్, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్‌లను కూడా టార్గెట్ చేయవచ్చన్నారు.

రాష్ట్రాల హక్కులను హరిస్తున్న కేంద్రం

బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గతంలో గుజరాత్ సీఎంగా పని చేసినపుడు రాష్ట్రాల హక్కులకు మద్దతుగా మాట్లాడేవారు. కానీ పీఎం పదవిని చేపట్టిన తర్వాత ఆయన రాజ్యాంగ పరిధిలో పని చేయడానికి సైతం రాష్ట్రాలకు అవకాశం ఇవ్వడం లేదు. రాష్ట్రాల మాటను వినడం లేదు.

-తమిళనాడు సీఎం స్టాలిన్

వైద్యులకు విశిష్ట గుర్తింపు సంఖ్య

నేషనల్ మెడికల్ కమిషన్ వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 31: దేశవ్యాప్తంగా వైద్యులందరికీ విశిష్ట గుర్తింపు సంఖ్యను 2024కల్లా జారీచేస్తామని నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ప్రకటించింది. ఇందుకోసం వైద్య వృత్తిలో ఉన్న వారందరి వివరాలతో కూడిన 'జాతీయ వైద్య రిజిస్టర్' (నేషనల్ మెడికల్ రిజిస్టర్-ఎన్ఎంఆర్)ని రూపొందించనున్నట్టు ఎన్ఎంసీ మంగళవారం తెలిపింది. దీనికి సంబంధించి పైలట్ ప్రాజెక్ట్‌ను ఆరు నెలల్లోగా చేపడతామని, 2024కల్లా దేశవ్యాప్తంగా అమల్లోకి తెస్తామని ఎన్ఎంసీ బోర్డ్ సభ్యుడు డాక్టర్ యోగేంద్ర మాలిక్ తెలిపారు. ప్రస్తుతమున్న 'ఇండియన్ మెడికల్ రిజిస్టర్' స్థానంలో ఎన్ఎంఆర్ అమల్లోకి వస్తుందన్నారు.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని వైద్య కళాశాలలకు రేటింగ్

వచ్చే ఏడాది నుంచి దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు రేటింగ్ ఇవ్వనున్నారు. విద్యార్థులకు అందించే విద్య నాణ్యతను బట్టి 2024-25 విద్యా సంవత్సరం నుంచి వాటికి రేటింగ్ కేటాయిస్తారు. ఈ మేరకు రేటింగ్స్ నిర్ధారణకు క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ)తో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎంఎన్‌సీ)అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం ప్రభుత్వ వైద్య కళాశాలలు మాత్రమే నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)లో భాగస్వామ్యమయ్యాయని, ఇక నుంచి వీటిలో ప్రైవేట్ వైద్య కళాశాలలను కూడా చేరుస్తున్నట్టు ఎంఎన్‌సీ బోర్డు సభ్యుడు డాక్టర్ యోగేంద్ర మాలిక్ చెప్పారు.

భీవండి పవర్‌లూమ్స్ బంద్

- 20 రోజులు మరమగ్గాల పరిశ్రమలు మూసివేత
- నిత్యం యార్న్ ధరల్లో హెచ్చుతగ్గులతో తీవ్ర నష్టం
- బట్టకు ధర రాక.. ప్రభుత్వాల సాయం లేక అవస్థలు

ముంబై, అక్టోబర్31(నమస్తే తెలంగాణ): తయారైన బట్టకు సరైన ధర రాక, ప్రభుత్వం నుంచి ఎటువంటి మద్దతు లభించకపోవడాన్ని నిరసిస్తూ మహారాష్ట్రలో భీవండీ పట్టణంలోని పవర్‌లూమ్ యాజమాన్య సంఘాలు బుధవారం నుంచి 20 రోజులపాటు మరమగ్గాల పరిశ్రమలను మూసివేస్తున్నట్టు ప్రకటించాయి. భీవండి పట్టణంలోని 40 సంఘాలకు చెందిన 700 మంది మరమగ్గాల పరిశ్రమల యజమానులు అక్కడి హాలారి విశా హాలులో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో అనేక విషయాలపై చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్టు అసోసియేషన్ ప్రతినిధి నరేశ్ సంచేటి వెల్లడించారు. వచ్చే దీపావళి పండుగకు ఎటువంటి బట్టకు డిమాండ్ లేకపోవడం, చైనా నుంచి వస్త్రం దిగుమతి కావడం పరిశ్రమ మూసివేతకు మరో ముఖ్య కారణాలుగా శాంతినగర్ పవర్‌లూమ్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నన్ సిద్ధిఖీ తెలిపారు. కేంద్రం, మహారాష్ట్ర ప్రభుత్వాల మద్దతు లభించకపోతే, మళ్లీ మునుపటి లాగే మరమగ్గాలను తుక్కుగా మార్చి, కిలోల చొప్పున అమ్ముకోవాల్సి వస్తుందని సిద్ధిఖీ ఆందోళన వ్యక్తం చేశారు.

10 లక్షల మంది ఉపాధికి దెబ్బ

మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన భీవండీలో దాదాపు 15 లక్షల మరమగ్గాలు ఉన్నాయి. 5 లక్షల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 5 లక్షల మంది ఈ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. గతంలో 17 శాతం ఎక్సైజ్ డ్యూటీ ఉండగా, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం 25 శాతం వరకు ఎక్సైజ్ డ్యూటీ వసూలు చేస్తున్నది. దాంతో వస్త్ర పరిశ్రమ తెలంగాణ, ఉత్తరప్రదేశ్, బీహార్, ఒరిస్సా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు తరలిపోతున్నది.

రగులుతున్న మహారాష్ట్ర

- తీవ్రరూపం దాల్చిన మరాఠా కోటా ఉద్యమం
- జాతీయ రహదారులు, రైల్వే ట్రాకుల దిగ్బంధం
- పలు చోట్ల ప్రభుత్వ, బీజేపీ కార్యాలయాలకు నిప్పు
- మరాఠ్వాడలోనే రిజర్వేషన్లు అమలవుతాయన్న సర్కారు
- ఇది అసంపూర్ణం.. ఒప్పుకునేది లేదు: మనోజ్ జరాంగే

పుణే-బెంగళూరు రహదారిపై టైర్లు కాల్చి నినాదాలు చేస్తున్న ఆందోళనకారులు

ముంబయి : మరాఠా కోటా ఉద్యమంతో మహారాష్ట్ర రగులుతున్నది. విద్య, ఉద్యోగాల్లో మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాలని ఆందోళనకారులు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నారు. జాతీయ రహదారులు, రైల్వే ట్రాకులను దిగ్బంధించారు. పలు చోట్ల ప్రభుత్వ, బీజేపీ కార్యాలయాలకు నిప్పుపెట్టారు. పుణే, శివగావ్, అహ్మద్‌నగర్ జిల్లాల్లో స్కూళ్లు, కాలేజీలు మూతబడ్డాయి. పుణే-బెంగళూరు రహదారిపై ఆందోళనకారులు టైర్లకు నిప్పుపెట్టారు. బీజేపీ-శివసేన సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముంబై-బెంగళూరు హైవేను రెండు గంటలపాటు దిగ్బంధించటంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రిజర్వేషన్ల అంశంపై ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ రాజకీయ పార్టీలకు చెందిన మరాఠా ఎమ్మెల్యేలు మంత్రాలయలోని నారిమన్ పాయింట్ వద్ద ఆందోళన చేపట్టారు. షోలాపూర్‌లో సామాజిక కార్యకర్తలు రైలు పట్టాలను దిగ్బంధించారు. జల్నా జిల్లా ఘన్‌సావంగి వద్ద కొందరు వ్యక్తులు పంచాయతీ సమితి కార్యాలయానికి నిప్పుపెట్టారు. హింగోలి జిల్లాలో బీజేపీ కార్యాలయాన్ని ఆందోళనకారులు తగులబెట్టారు.

కుంబీ కుల సర్టిఫికెట్లు జారీ చేస్తామని ప్రకటన

మరాఠ్వాడా ప్రాంతంలోని మరాఠాలకు కుంబీ కుల సర్టిఫికెట్స్ జారీ చేయాలంటూ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి సందీప్ షిండే కమిటీ ఇచ్చిన నివేదికకు మహారాష్ట్ర సర్కార్ మంగళవారం ఆమోదం తెలిపింది. కుంబీ కుల సర్టిఫికెట్స్ జారీ ప్రారంభిస్తామని అధికారికంగా ప్రకటించింది. రిజర్వేషన్లపై గతంలో తీసుకొచ్చిన చట్టాన్ని సుప్రీంకోర్టు 2021లో కొట్టేసింది. దాంతో మరాఠా కమ్యూనిటీ ప్రజలకు ప్రభుత్వం కుంబీ సర్టిఫికెట్లు ఇవ్వాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది.

దీక్ష కొనసాగుతుంది: మనోజ్ జరాంగే

రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనపై సామాజిక కార్యకర్త మనోజ్ జరాంగే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన జల్నాలో విలేకరులతో మాట్లాడుతూ, 'ఇది అసంపూర్ణమైన రిజర్వేషన్. దీనిని ఎంతమాత్రమూ ఒప్పుకోం. రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి చట్టాన్ని చేయాలి' అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరాఠాలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నారని, రాష్ట్రమంతటా వర్తించేలా రిజర్వేషన్లు ప్రకటించాలని జరాంగే అన్నారు. మరాఠాలోని కొన్ని వర్గాలకు మాత్రమే వర్తించేలా రిజర్వేషన్లు కల్పించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రిజర్వేషన్ల కోసం చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష, గ్రామాల్లోకి రాకుండా రాజకీయ నాయకులను అడ్డుకోవటం కొనసాగిస్తాం' అని ప్రకటించారు.

కేంద్ర మంత్రిపై కేరళ పోలీసుల కేసు

కొచ్చి: కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌పై కేరళ పోలీసులు కేసు నమోదు చేశారు. వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని పెంచేలా వ్యాఖ్యలు చేశారంటూ అభియోగాలు నమోదయ్యాయి. జెహోవా విట్నెసెస్ ప్రార్థనలు జరుగుతున్న ప్రదేశంలో ఇటీవల బాంబు పేలుళ్లు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. దీనిపై కేంద్ర మంత్రి స్పందిస్తూ రాష్ట్రంలో సంఘవిద్రోహ శక్తులు రెచ్చిపోతుంటే విజయన్ సర్కారు బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. బాంబు పేలుళ్ల కేసులో నిందితుడు కీలక విషయాలు వెల్లడించాడు. ఇంటర్నెట్‌లో చూసి బాంబుల తయారీ నేర్చుకున్నట్టు తెలిపాడు. ఈ బాంబుల తయారీకి కేవలం మూడు వేల రూపాయలు మాత్రమే వెచ్చించినట్టు 48 ఏండ్ల డామినిక్ మార్టిన్ చెప్పాడు.

నవంబర్‌లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు: ఐఎండీ

న్యూఢిల్లీ: ఎల్‌నినో పరిస్థితులు బలపడుతున్న క్రమంలో నవంబర్‌లో దేశంలోని చాలా ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదయ్యే అవకాశం ఉన్నదని ఐఎండీ మంగళవారం పేర్కొన్నది. ఐఎండీ డీజీ మృత్యుంజయ్ మహాపాత్ర మాట్లాడుతూ నవంబర్‌లో దేశం మొత్తంగా చూస్తే సాధారణ వర్షపాతం నమోదవుతుందని పేర్కొన్నారు. మరోవైపు దక్షిణ భారతదేశంలో ఈశాన్య రుతుపవనాల వర్షపాతం ఈ ఏడాది అక్టోబరులో అతి తక్కువగా నమోదైంది.

గాలి కాలుష్యంతో పార్కిన్సన్స్ ముప్పు తీవ్రం

న్యూఢిల్లీ: పార్కిన్సన్స్ వ్యాధి కారకాల్లో వాయుకాలుష్యం ఒకటని అమెరికాలోని బారో న్యూరలాజికల్ ఇన్‌స్టిట్యూట్ రిసెర్చర్ బ్రిట్టనీ క్రిజిజనోవ్‌స్కీ చెప్పారు. కాలుష్యం తక్కువ స్థాయిలో ఉన్న ప్రాంతాల్లో నివసించే వారికన్నా, కాలుష్యం 50 శాతం కన్నా ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో నివసించేవారికి ఈ వ్యాధి ముప్పు 56 శాతం ఎక్కువగా ఉంటుందన్నారు.

పిల్లల ఇన్‌ఫెక్షన్లకు యాంటీబయాటిక్స్ పనిచేయట్లేదు!

న్యూఢిల్లీ: పిల్లల్లో ఇన్‌ఫెక్షన్లకు వాడే యాంటీ బయాటిక్స్ పనిచేయట్లేదని తాజా అధ్యయనంలో తేలింది. యాంటీబయాటిక్స్ విచ్చలవిడిగా వాడటంతో నిరోధకత అధిక స్థాయికి చేరుకుందని, దీనివల్లే ఔషధాలు పనిచేయటం లేదని 'యూనివర్సిటీ ఆఫ్ సిడ్నీ' పరిశోధకులు తేల్చారు. శిశువులు, పిల్లల్లో ప్రాణాంతకంగా మారుతున్న ఇన్‌ఫెక్షన్లపై డబ్ల్యూహెచ్‌వో సిఫారసు చేసిన యాంటీ బయాటిక్స్ చూపుతున్న ప్రభావం *50%* లోపే ఉంటున్నది. యాంటీబయాటిక్ నిరోధకత అన్నది ఆగ్నేయాసియా, పసిఫిక్ ప్రాంతాల్లో తీవ్రంగా ఉందని అధ్యయనంలో తేలింది. సెప్సిస్ అనే